

కొడుకు ఒంటిమీద చెయ్యివేసి చూసింది అరుణ. జ్వరం ఏమీ తగ్గలేదు. ఇంకా ఎక్కువయిందేమోనని అనుమానం వేసింది. ఆమెకు ముచ్చెమటలు పోసేయి. బయటికి వెళ్లి చూసింది. ఎవరిని పిలుద్దామన్నా ఎవరూ లేరు.

ఆ అద్దెకొంపలో ఇటుపక్కనున్న స్కూలు మాస్టారు స్కూలుకి పోయేరు. అతడి భార్య పుట్టింటికి పోయింది. అటువేపున ఉండే టైలరు తన దుకాణానికి పోయేడు. అతడి పెళ్లాం లేచిపోయింది. ఈ ముందువా మేడఇంట్లో అద్దెకున్న మరొక సంసారం మొగుడు వదిలేసిన ఒక స్త్రీ, విధవతల్లితో, భర్త వల్ల సంక్రమించిన రోగాలతో మూల్గుతూ పడుకొని

ఎందుకు మంచివాడుకాడు? అతను చాలా మంచివాడు. తనంటే ఎంతో ఇది అతనికి. చాకలెట్లు, పిప్పరమెంట్లు ఇస్తాడు. బుగ్గమీద చిటికవేసి ముద్దుపెట్టుకుంటాడు. ఇంజినీరు వౌతావా? డాక్టరు వౌతావా? అని అడుగుతాడు. "అతను చాలా మంచివాడమ్మా. నే నంటే ఎంతో ఇది" అని బాబు అంటాడు. తనేం చెబితే నమ్ముతాడు. కాని తనకు బాగా తెలుసు. ఎలా తెలుసు? ఏమో తనకి తెలీదు. తనకి తెలీకుండానే తెలుసు అతని గుణం మంచిదికాదని. ఏ గుణం? అతనికున్న మంచి గుణాలు మంచివి కావా? చెడ్డగుణాలు మంచివి కావా? ఏది మంచి, ఏది చెడు? అతనికి రెండే రెండు గుణాలు చెడ్డవి. తాగుడు, మరొకటి... తను అనుకోడం పాపం. అవి ఉండడంవల్ల అతను చెడ్డవాడా? అవును. అవి లేకపోతే అతను మంచివాడా? ఏమో, అవచ్చు. కాకపోవచ్చు. తనకెలా తెలుసు అతనికా దుర్గుణాలున్నాయని? తెలుసు. తను వింది, వాళ్ళూవాళ్ళూ అనుకోగా. వినాలని వినలేదు. కాని వింది. అదీకాక తనెప్పుడు బయటికివచ్చినా అతను మేడ వరండామీదే నిల్చుంటాడు. మెరుపుల్లా మెరిసే మాయమైన ఆ వంచెల అంచులు? ఆ బుజావు చాలదా? ఇంకా... బాబుని ఎందుకు మంచి చేసుకుంటున్నాడు? మంచికే మంచి చేసుకుంటున్నాడో, చెడ్డకే మంచి చేసుకుంటున్నాడో తెలుసా? చెడ్డకే. తనకి తెలుసు. అతను మంచివాడు కాడు. ఏం చెడ్డ? ఏం చెడ్డ, తనతో మాట్లాడాలని. తనతో...

ఈ ఊహ ఆమె మనసుకి ఛెళ్ళునతగిలి తీవ్రమైన గాయాన్ని చేసింది. శరీరాన్ని జీవరహితంగా చేసింది. స్తంభింపజేసింది. ఆ స్తబ్ధతలో, జడస్థితిలో భాస్కర్ కలవరింతలు ఆమె చెవిని పడలేదు. భాస్కర్ కలవరిస్తున్నాడు. "నాకా బొమ్మ కావాలమ్మా... నాకు తెచ్చి ఇవ్వవూ? నే నొక్కణ్ణే దాంతో ఆడుకుంటాను. ఎవర్నీ రానివ్వను. ముట్టుకోనివ్వను."

ఈ బొమ్మే ఎందుకు కావాలి బాబుకి? ఈ బొమ్మే వాడి మనసులో ఎందుకు తిష్ఠ వేసుకుంది? ఆ బొమ్మని ఎందుకతడు బాబుకి చూపించాలి, అలా పోతూఉంటే పిలిచి? కిచ్చి వాడి పసిమనసు ముందు ఎందుకాడించాలి? కొను, అతనికి తెలుసు, ఆ బొమ్మకోసం బాబు కలవరిస్తాడని, తనని వేధించుకుతింటాడని, తను వెళ్ళి అతణ్ణే ప్రాధేయపడుతుందని.

ఛీ, తనకెందుకీ ఊహలు? అతడి కటువంటి ఊహలుంటే తనకేం? కాని, బాబు మనసుతో ఆడుకొనే హక్కేముంది అతడికి? బాబు మనసు తన మనసుతో ముడిపడిందని అతడికి తెలుసు. తెలిసి ఆ లేతమనసుని లొంగదీసుకుంటే... తను...

బాబు కలవరింతలు ఆమెకిప్పుడు వినిపించేయి. అతడి వెక్కిలికి తన వెక్కిలి అవించి, ఏడుస్తూ అంది అరుణ: "ఆ బొమ్మే నీ కెందుకు కావలిసివచ్చిందిరా, తండ్రీ? అటువంటి బొమ్మ నే నెక్కణ్ణుంచి తెచ్చేదిరా, నాన్నా? మూడు రోజులయి జ్వరం పెట్టుకొని, అదే కలవరింతలా? జావన్నా తాగకుండా ఎండిపోయేవే, నా బంగారుకొండా! పోసిన మందన్నా ఒంటపట్టదే! నీ గతేంకానురా, బాబూ? నీకోసమే ఈ ప్రాణాలున్నాయిరా నా కొండా!" అరుణ వెక్కివెక్కి ఏడుస్తూ కొడుకు పక్కని కూలబడింది. మాసి, చిరుగులుపడ్డ ఆ చీరలో మట్టిలో దాగిన మేలిమిబంగారంలా ఆమె శరీరం మెరిసి పోతూంది.

స్కూలునుంచి మొన్న వస్తూనే, "అమ్మా! ఒంట్లో బావులేదే. జ్వరం వచ్చినట్టుందే!" అన్నాడు బాబు. ఒంటిమీద చెయ్యివేసి చూసింది. ఒళ్ళు మరిగిపోతూంది. వెంటనే మంచంమీద పడుకోపెట్టి దుప్పటి కప్పింది. వీధిలోనే ఉన్న డాక్టర్ పిచ్చిరాజుగారి హాస్పిటల్‌కి వెళ్ళి మందుతెచ్చి పోసింది. జ్వరం హెచ్చవుతూ వచ్చిందేకాని తగ్గ లేదు. నిన్న డాక్టరుగారు వచ్చి చూసి వెళ్ళేరు. మాత్రలిచ్చేరు. జ్వరం తగ్గ లేదు. కలవరింతలు విని, "బొమ్మేమిటి?" అని డాక్టరడిగేరు. తను చెప్పింది. "తెలివి వచ్చినప్పుడు అటువంటి బొమ్మదన్నా చేతులో పెట్టండి మేలుంటే" అని అతనన్నారు.

ఎక్కణ్ణుంచి తేగలదు తను అటువంటి బొమ్మ? భర్త కూడబెట్టిన డబ్బు, ఉన్న కొద్దిపాటీ బాంకులో వెయ్యగా, నెలా వచ్చే వంతై రూపాయల వడ్డీతో ఎలాగో రోజులు గడుపుకువస్తూంది. బాబు కేలోటూ లేకుండా చూసుకువస్తూంది. కొండపల్లిబొమ్మలు కొని పెట్టింది. ఇప్పుడు స్కూల్లో వేసింది. వాడిని పెంచి, పెద్దచేసి ఒక ఇంటివాడిని చెయ్యాలని బతుకు ఈడుస్తూంది చాలీచాలని డబ్బుతో. ఇప్పుడిలా ఈ జ్వరం ముంచుకువచ్చింది. ఏం దారి?

మూసుకుని నీరసంగా ఉన్న కొడుకు కళ్ళలోకి చూసిందామె. అచ్చు ఆయన కళ్ళే, ఆయన ముఖమే.

ఆయనముఖం...ఆఅమాయికపునవ్వుతో...ఎప్పుడూ అదే నవ్వు ఆ ముఖంమీద. ఒక్కనాడూ ఆయన దమమీద విసుక్కోడంకాని, చిరాకుపడడంకాని జరగలేదు. ఎప్పుడూ తన సంతోషం, తన ఆనందంకోసమే ఆయన ప్రయత్నం. ఆయన ధ్యాస ఎప్పుడూ తనవిగురించే. ఆయనకెప్పుడు తనుగురించి ఏ కోరికలూ ఉండేవి కావు. పెళ్ళి అయ్యాక మూడేళ్ళు మూడు క్షణాల్లా గడిచిపోయేయి. "అరుణా, నీ పేరుకి తగ్గట్టు, ఎర్ర చీరలో ఎంత అందంగా ఉంటావో చెప్పలేను. సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు రక్తవర్ణంగుతో ఉంటాడు చూశావూ? ఎంత బావుంటాడని? అలానే నువ్వూను. ఎర్రచీరే కట్టుకుంటుందేమో రతీదేవి? నిన్ను ఎర్ర చీరలో చూస్తే అలా అనిపిస్తుంది. రిబ్బన్ బోర్డరు జరీఅంచు ఎర్రచీరకోసం గాలిస్తున్నాను. సరిఅయింది దొరకటంలేదు." వద్దంటే వినేవారుకారు. "ఆ నెక్లెసు, పొర్లది, అటువంటిది నీ మెడలో ఉంటేనా?" "నన్ను ఆభరణాలతోనూ, చీని చీనాంబరాలతోనూ తూచకండి, నన్ను నన్నుగానే చూడండి" అని అంటే, "కాదు, అరుణా, అందాన్ని పూజచెయ్యాలి. నీకు అందం, గుణం రెండూ కలిసేయి. నిన్ను పూజచెయ్యడానికి ఇవన్నీ ఏపాటివే?" అనేవారు. 'పువ్వులతో చెయ్యండి. నా తలలో మల్లెలు మీ చేతులతో ముడవండి. ఎర్రగులాబిని నాసికలో మీ చేతులతో తురమండి. అంతకన్న మహాభాగ్యం నాకేం కావాలి?' అని అనుకొనేది, చెప్పేది. ఆయన వినేవారా? "ఎరుపు శుభం, అరుణా!" అనేవారు. శుభం! ఎరుపు! ఎర్రటి రక్తవర్ణమదుగు. అందులో

# అత్తరువుల పరిమళాలు అలదుకో!

ఎస్. చంద్రం

నవత్రపనొలికించు నవోఢలా
నట్టాడుతూ వచ్చింది వసంతం!

ప్రపూర్ణారుణ పల్లవాలతో,
పచ్చపచ్చని పర్ణాలతో
ప్రకృతి చేసుకుంటూంది సీమంతం!

పూర్వాచల రవిబింబంలో
అపూర్వంగా గోచరమయింది నవతేజం!
మానవ ప్రగతికి అదొక
మహాపథ సంకేతం!

గతానుభవ స్మృతులతో బిత్తరపోక,
నితాంతం జీవితంలో అత్తరుల పరిమళాలు
నీలో ఒత్తుగా అలదుకో!


శోకానలంతో నీ ఎద మండినప్పుడు,
బాధాజ్వాలతో నీ పెదాలు ఎండినప్పుడు
మృదులాశా మధుకణాలను
మెండుగా నీ డెందంలో వర్షించుకో!

ప్రగాఢకోప సంతమసం నిన్ను పట్టి
చుట్టుముట్టితే,

ప్రచండాభిజాత్యం నిన్ను పరిభ్రమింపజేస్తే
కష్టాల కాలనాగులు నిన్ను కాటెయ్య
జూస్తే!

తటుక్కున గుప్పెడు సహనామృతాన్ని
గుటుక్కున మింగివెయ్యి!

అప్పుడు చూడు! నీలో పెల్లుబికివచ్చే
అంతులేని ఆనందసౌరభాల అగరుధూమ
తరంగాలు! *



నీడలేని నడక — చిత్రం—ఎస్. ఆనందవల్లి (మద్రాసు-21)

బాబు జ్వరంపెట్టుకున్నాడు. స్పృహ పోయింది. ఆ బొమ్మకోసం ప్రాణాలు పోగొట్టుకుంటున్నాడు. ఆ బొమ్మ ఒక్కసారివ్వండి. తెలివివచ్చినప్పుడు చూపిస్తే వాడి ప్రాణాలు దక్కచ్చు." ఆ మాటలు ఆవేశరహితంగా అని ఆమె ఊరుకుంది, తల దించుకుని.

రెడ్డిగారి గొంతు ఆవేశపూరితమయింది. "బాబుకి జ్వరమా? బొమ్మకోసం...ఈ బొమ్మకోసం బెంగ పెట్టుకున్నాడా? ప్రాణాలు పోతాయా? ఏమి టంటున్నారు మీరు?"

ఆమె ఒకే ఒక మాట అంది. "ఔను."

ఎందుకింకా ఇతడికీ నటన? ఎలకతో పిల్లికెందుకీ చెలగాటం? ఉచ్చులన్నీ తనచుట్టూ బిగుసుకుపోయేయి. ఉచ్చులు బిగించినవాడు ఎంతన్నా నటించవచ్చు. తను ఇప్పుడు అతని బొమ్మ. ప్రాణమున్న బొమ్మ! తనకు కావలిసింది ప్రాణంలేని మరబొమ్మ.

అతడు లేచి టేబిలుమీద ఉన్న బొమ్మ తీసి దగ్గిరగా వచ్చేడు. ఆమె బొమ్మకేసి మంత్రముగ్ధలా చూస్తూ నిల్చుంది. అదుగో ... అతడి నల్లటిచెయ్యి ... హస్తం ... రాక్షసుడి హస్తం ... ప్రాణమున్న బొమ్మకోసం ముందుకువస్తోంది.

అతడు బొమ్మను ముందుకువచ్చిన ఆమె హస్తంలో ఉంచుతూ అన్నాడు: "ఇదండి బొమ్మ. దీనికోసం మీరు రావాలా? పొరుగింటి కుర్రాణ్ణి పంపితే ఇవ్వనా? మీరిక్కడికి రావడం బాగోదు. నాగురించి అందరూ ఏవేవో అనుకుంటారు. మీరు ఇలా రావడం మీకు మంచిది కాదు. భాస్కర్ అంటే నా కదోవిధమైన అపేక్ష, ఎందుకో చెప్పలేను. అతనికోసమనే ఈ బొమ్మ తెప్పించేను, పుట్టినరోజున కానుకగా పంపుదామని. మీరింక వెళ్లండి." అతడు అటు తిరుగుతూ ఆగి అన్నాడు: "ఉండండి. బాబుకి బత్తాయిపళ్లు తీసుకు వెళ్లండి . . . ఇస్తాను" అంటూ చకచకా మరో గదిలోకి వెళ్లేడు.

ఆమె స్తంభీభూతురాలై, చేతనున్న బొమ్మకేసి చూస్తూ ఉండిపోయింది. తన చెవులని తానే నమ్మలేకపోయింది. రెడ్డిగారు వెళ్లిన గదికేసి చూస్తూ నిలబడిపోయింది. ఆమె ఒళ్లంతా ఒక్కసారిగా చల్లబడిపోయింది. ఆమె కళ్లకు కట్టిన వెయ్యిపడగల సర్పం, కబంధుడి హస్తాలు, రాక్షసుడు—అన్నీ మాయమైపోయాయి. తన కృతనిశ్చయం ... తను ఏం ఇవ్వడానికి వచ్చిందో, ఆ ప్రాణమున్న బొమ్మ మాయమైపోయింది. తను మళ్లా యథారూపంగా తనే, అరుణ. తను అరుణగా మారిపోయింది. తను అరుణే. ఇంకా అరుణే. తన భర్త అరుణ్ణి. అతడి ప్రేమల ఊహల ప్రతిరూపం. ఆమె తన నిజస్థితి పొందింది.

నిజస్థితికి రాగానే ఆమెకు తను ఎక్కడున్నదీ గుర్తుకు వచ్చింది. ఆమె శరీరం కంపించింది. ఇది రెడ్డిగారి ఇల్లు! ఈ ఇంటివేపు కన్నెత్తి చూసేందుకే ఏ స్త్రీ అన్నా సిగ్గుపడిచస్తుంది. అటువంటిది తను ఈ ఇంట్లో— అతడి గదిలో—చేతిలో అతడిచ్చిన బొమ్మతో—అమ్మో! ఏమిటిది? ఎలా జరిగింది? బాబు ... బాబుకోసం ... అతను మంచివాడు. బాబంటే అతని కభిమానం.

ఔను. కాని అలా అందరూ అనుకుంటారా? అతను మంచివాడు. బాబంటే అభిమానంవల్ల అడగగానే బొమ్మ ఇచ్చేడన్నా నమ్ముతారా? ఎందుకు నమ్ముతారు? అతనే అన్నాడు, "మీరు రావడం మంచిదికాదు, ఇక్కడుండడం మంచిది కా"దని. కబురుచేస్తే ఇచ్చి ఉందునన్నాడు. అందరూ అతణ్ణిగురించి ఏం అనుకుంటున్నారో, తను అతడి గదికి వెళ్లినందుకు ఏమనుకుంటారో అతడికి తెలుసు. తను రావడం ఎవరన్నా చూసేరేమో? లేదు. . . చూడలేదు!

ప్రాణంలేని బొమ్మ తనకి దొరికింది. ప్రాణంఉన్న తన బొమ్మ తన దగ్గిరే ఉంది. అతడు దానిని కోరలేదు. కాని ఎవరు నమ్ముతారు? నమ్మరు ... నమ్మరు. ఈ బొమ్మని అందరూ చూస్తారు. బాబుమీద ప్రేమకొద్దీ అతడిచ్చేడంటే నమ్మరు. ఆ నిజం ఎవ్వరూ నమ్మరు. లేని కళంకం తన కంటగడతారు. కళంకం . . . తనకి! ప్రాణమున్న తన బొమ్మ పదిలంగానే ఉంది. ప్రాణంలేని బొమ్మ తనచేత. అందరూ ఈ బొమ్మ చూసి, తన బొమ్మ తనవద్దే ఉందంటే నమ్మరు.

రెడ్డిగారింక వస్తారు. పళ్లు ... బాబుకోసం ... పళ్లు . . . బాబూ! . . . బాబూ! ఈ బొమ్మలన్నీ నీ కెందుకు? నేనున్నాను బాబూ, నీకు! ఈ ప్రాణమున్న బొమ్మ, నీ తల్లి సురక్షితంగా ఉందిరా, తండ్రీ. నీ తల్లి కళంకరహితురాలురా, నాన్నా: ఏ కళంకం అంట నివ్వను నీ తల్లికి. అంటనివ్వను.

ఆమె తల గిర్రున తిరుగుతూంది. బొమ్మ జారి కింద పడింది.

ఆమె గదిలోంచి పరిగెత్తుకుంటూ పోయి ఒక్క ఉదుటున మెట్లుదిగి వెళ్లి, తన ఇంట ప్రవేశించి తలుపు గడియపెట్టి, కొడుకుపక్కన మంచంమీద కూలబడింది.

"బాబూ, నేను వచ్చేనురా! నిప్పులాంటి నా మనసు... నీ తండ్రి ఆశీస్సు ... నీ వేడిని హరిస్తాయి. బాబూ, చూడు!" అంటూ అతడి తల తన వక్షానికి అదుము కొని రోదించింది.

బాబు పలకలేదు. చలనంలేకుండా పడి ఉన్నాడు.

ఆమె అతడి కళ్లలోకి దీక్షతో చూసింది. "కళ్లు విప్పు, నాన్నా. నన్ను చూడు. నా కళ్లలోకి చూడు. నీకు కావలిసిందంతా నా కళ్లలో ఉంది. అపారమైన ప్రేమ, వాత్సల్యం ... ఏం లేదు నా దగ్గిర? నా ప్రాణం . . . నా ప్రాణం తీసుకో, నా తండ్రీ."

బాబు మెల్లిగా కళ్లు విప్పేడు. ఆమె మనసు విప్పారింది. కొట్టుకుంది.

బయట తలుపు కొడుతున్న చప్పుడయింది. రెడ్డిగారి గొంతు వినిపిస్తోంది. "అమ్మా, తలుపు తియ్యండి. బాబుకి ఈ బొమ్మ ఇవ్వండి. డాక్టరు నాతో చెప్పేరు, బాబు బొమ్మకోసం కలవరిస్తున్నాడని. అందుకు తెచ్చేను. బాబుకి ఈ బొమ్మ ఇవ్వండి!"

ఆమె చరాలున తలుపు దగ్గిరికి వెళ్లి అరిచింది కోపంతో: "మమ్మల్నిలా బతకనివ్వండి, బాబూ! వెళ్లండి. బాబుకి ప్రాణంలేని మీబొమ్మ అక్కర్లేదు. వాడి తల్లిని నేనున్నాను. నేను బాబుని బతికించుకుంటాను. మమ్మల్నిలా బతకనివ్వండి. మా పరువుప్రతిష్ఠలిలా ఉండనివ్వండి. వెళ్లండి . . . వెళ్లండి." ఆమె రోషంతో ఏడ్చింది. సిగ్గుతో, లజ్జతో ముఖం ఎర్రబారింది.

బాబు దగ్గిరికి వచ్చి, విప్పారిన అతడి కళ్లలోకి చూస్తూ అంది: "మీ అమ్మని, నాన్నా, నా కళ్లలోకి చూడు! నా కళ్లలోకి చూడు." ఆత్మశక్తి అంతా వినియోగించి అతడి కళ్లలోకి చూస్తూ కోటి దేవుళ్లకు మొక్కుకుంది అరుణ.

బాబు ఆమె కళ్లలోకి నీరసంగా చూసి, "అమ్మా ... ఆ బొమ్మ లేవూ!" అని మైకంగా అన్నాడు. అంటూనే అతడి కళ్లు మూతలు పడ్డాయి, ఈసారి ఎప్పటికీ.

అనంతవాయువులలో, అంతరిక్షంలో, నక్షత్ర మండలాలలో, స్వర్గంలో ఎక్కడో మనకు తెలియని లోకంలో ఎన్నో బొమ్మలతో ఆడుకుందామని బాబు ఆత్మ ఎగిరిపోయింది!

జీవంలేని అతడి దేహంమీద పడి ఆమె పిచ్చిదానిలా కేకపెట్టింది. "బాబూ, నా బంగారుకొండా! ఎక్కడికి పోయేవురా నన్నొదిలి? ఏమంటి! ఎక్కడున్నారు మీరు? నన్నూ తీసుకపోరూ!" ఆమె రోదిస్తూ బాబు శరీరం మీద పడింది. ఆమె ఒళ్లు చలనం కోల్పోయింది.

ప్రాణాలుండే బొమ్మలలోని ప్రాణాలు పోయేయి. ప్రాణంలేని బొమ్మలు మిగిలేయి. ★